ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి 2025 8 పేజీలు
గుంటూరు పల్నాడు





పైర్లకు నీటి ఎద్దడి

- సాగర్‌లో వారాబందీ - డెల్టాలో అరకొర సరఫరా
- చివరి భూముల రైతులకు తప్పని ఇక్కట్లు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పంటలకు నీటి ఎద్దడి తీవ్ర రూపం దాలుస్తోంది. దాదాపు 65 రోజులుగా వర్షాలు లేకపోవడం వల్ల నీటిఎద్దడి పెరిగింది. మరోవైపు ఎగువ నుంచి ప్రవాహంకూడా లేకపోవడం వల్ల నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయి. పులిచింతల జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ఆదివారం సాయంత్రం 34.50 టిఎంసిల నీటి నిల్వ ఉంది. అయితే ఇప్పటికే నీటి వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ఎపి ప్రభుత్వంపై కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డుకు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. పులిచింతలలో నీరు ఉన్నా కేవలం 2 వేల క్యూసెక్కులు మాత్రమే దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా డెల్టాకు 1460 క్యూసెక్కులు మాత్రమే ఇస్తున్నారు. అయినా కృష్ణా డెల్టా పరిధిలోని రబీ పంటలకు నీటి ఎద్దడి కొనసాగుతోంది.

మరోవైపు సాగర్ ▶ 2లో

ఆ బడ్జెట్‌తో రైతులకు న్యాయమెలా?

- అవసరం రూ.26 వేల కోట్లు.. కేటాయింపు రూ.9400 కోట్లు
- అన్నదాత సుఖీభవకు నిధులపై కౌలురైతు సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అన్నదాత సుఖీభవ పథకానికి రాష్ట్రంలో అర్హులైన 50 లక్షల చిన్న, సన్నకారు రైతు కుటుంబాలున్నాయని, మరో 15 లక్షల మంది భూమిలేని కౌలురైతులున్నారని, మొత్తం 65 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ కోరారు. వీరందరికీ రూ.13 వేల కోట్లు అవసరమని, గతేడాది ఇవ్వాల్సిన వాటితో కలిపి మొత్తం రూ.26 వేల కోట్లు కావాల్సి ఉండగా తాజా బడ్జెట్‌లో రూ.9400 కోట్లు కేటాయింపులతో రైతులకు ఎలా న్యాయం చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న సాగుదారుల్లో కౌలు రైతులు అధికంగా ఉన్నారని, అయినా బడ్జెట్‌లో కౌలురైతుల ప్రస్తావనే లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కౌలురైతుల చట్టాన్ని ఈ సమావేశాల్లోనే ఆమోదించాలని, ఖరీఫ్ ప్రారంభానికి ముందే కౌలు రైతులను గుర్తించి నమోదు చేయాలని, అందుకు అనుగుణంగా యంత్రాంగాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. 2024 ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు ఉచిత పంటల బీమా అమలుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. మిర్చి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కనీస మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, మద్దతు ధరలు కల్పించి రైతుల ఆత్మహత్యలను ఆపాలని కోరారు. వ్యవసాయం లాభసాటి కావాలన్నా, రైతుల ఆత్మహత్యలు ఆగాలన్నా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు అవసరమని, కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని కోరారు.



లెక్కింపు ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

నేడు ఓట్ల లెక్కింపు

ఉదయం 8 గంటల నుండి ప్రారంభం - ఏసీ కాలేజీలో లెక్కింపు కేంద్రం

లెక్కించాల్సినవి 2.41 లక్షల ఓట్లు - ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌ఓ నాగలక్ష్మి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రులు నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏసీ కాలేజీలో సోమవారం నుండి చేపట్టనున్న ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి ఏసీ కాలేజి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంరతం జేసీ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్‌ఒ ఖాజావలితో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27న ఓటింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరిచినట్లు చెప్పారు. పోలింగ్ 69.57 శాతం నమోదైనందున దాదాపు 2.41 లక్షల ఓట్లు లెక్కించాల్సి ఉందని చెప్పారు. ఉదయం 8 గంటల నుండి లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్యత ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం కౌంటింగ్ సుమారు రెండు నుంచి మూడ్రోజులు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమికంగా లెక్కింపు మొదటి రౌండ్లో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను సరిచూసుకొని మిక్సింగ్ చేస్తారన్నారు. తర్వాత చెల్లుబాటయ్యే ఓట్లను పరిశీలించి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి నిర్దేశించిన కోటా ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలుపొందినట్లు ప్రకటిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఎవరికి నిర్దేశిత కోటా ఓట్లు రాకపోతే ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం తక్కువ ఓట్లు వచ్చిన

▶ 2లో



03-03-2025 సోమవారం
సహర్ (ఉదయం) : 5.07
ఇఫ్తార్ సాయంత్రం : 6.20
04-03-2025 మంగళవారం
సహర్ (ఉదయం) : 5.07

గుంటూరు రేంజికి 53 మంది కొత్త ఎస్‌ఐలు

ఉత్తర్వులు అందజేసిన గుంటూరు ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి 2లో

2లో

బినామీల పేరిట ఉన్న ఆస్తులు వెలికితీయాలి

సాయిసాధన చిట్‌ఫండ్ బాధితుల సమావేశం డిమాండ్ - నేడు మంత్రి లోకేష్ వద్దకు

నేడు నల్లమడ రైతు సంఘం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు

సోమవారం సాయంత్రం 5 గంటలకు పెదనందిపాడు లోని శివాలయం దగ్గర నల్లమడ రైతు సంఘం విస్తృత సమావేశం జరుగుతుందని సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు తెలిపారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపునకు రూ.100 కోట్లు నిధుల కేటాయించిన విషయం గురించి, గుంటూరు ఛానల్ పొడుగింపు కోసం చేపట్టిన ఆందోళనలు సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేత గురించి, నల్లమడ వాగు ఆధునీకరణ కొరకు నిధుల కేటాయించాలని కోరుతూ, బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనే విషయం గురించి, తదితర ఇతర అంశాలపై ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. రైతు సోదరులందరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేసి, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



ఏజీ కాలేజీలోని ఓట్ల లెక్కింపు కేంద్రం

నేడు ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వారికి వచ్చిన తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచుతూ లెక్కింపు కొనసాగుతుందని వివరించారు. ఓట్ల లెక్కింపు కోసం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా 750 మంది సిబ్బందికి వివిధ డ్యూటీలు కేటాయించామని, అభ్యర్థులు సైతం ఏజెంట్లను మూడు షిఫ్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు లేకుండా ఎవర్నీ ఓట్ల లెక్కింపు ప్రాంతానికి అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించరని, పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని అనుమతిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేశామని, వీటితో పాటు ఇతర అవసరమైన అన్ని ఏర్పాట్లనూ సిద్ధం చేశామని చెప్పారు.



లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



ఏర్పాట్లపు పరిశీలిస్తున్న ఆర్ఒ నాగలక్ష్మి

బినామీల పేరిట ఉన్న ఆస్తులు వెలికితీయాలి

సాయిసాధన చిట్‌ఫండ్ బాధితుల సమావేశం డిమాండ్ - నేడు మంత్రి లోకేష్ వద్దకు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న ఈవిఎం స్వామి, హాజరైన బాధితులు

ఇటీవల రూ.100 కోట్లకు పైగా చిట్స్, నగదు రూపంలో వందల మంది నుండి వసూళ్లకు పాల్పడి బోర్డు తిప్పేసిన సాయిసాధన చిట్ ఫండ్ ఎమ్‌డి పాలడుగు పుల్లారావు బాధితులు నరసరావుపేట పట్టణంలోని ఓ హోటల్లో ఆదివారం సమావేశమయ్యారు. రిమాండ్‌లో ఉన్న పుల్లారావుతో పాటు వారి కుటుంబ సభ్యులను విచారించాలని, బినామీ పేర్లతో ఉన్న ఆస్తులను వెలికితీయాలని సమావేశంలో బాధితులు నిర్ణయించారు. రూ.వందల కోట్లు నష్టపోయిన 500 మందికి పైగా బాధితుల కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అసెంబ్లీలో ప్రస్తావించి బాధితుల పక్షాన నిలవాలని కోరారు. నరసరావుపేటలో పుల్లారావు మాదిరి మరో 25 మంది పేర్లు రాబోతున్నాయని, దీనిపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఆర్థిక నేరగాళ్లను ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని నిలువరించాలన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే బాధితులు రాష్ట్ర హో శాఖ మంత్రి అనితను కలిసి విన్నవించారు. ఈ క్రమంలోనే సోమవారం ఎమ్మెల్యే అరవిందబాబు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకుంటామని చెప్పారు.



నూతన ఎస్ఐలతో మాట్లాడుతున్న గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి

గుంటూరు రేంజికి 53 మంది కొత్త ఎస్ఐలు

ఉత్తర్వులు ఇచ్చిన ఐజి త్రిపాఠి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు శాఖలో శిక్షణ పూర్తి చేసుకుని అనంతపురం నుంచి గుంటూరు వచ్చిన ప్రొబెషనరీ ఎస్సైలు ఆదివారం రేంజి కార్యాలయంలో ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠిని కలిశారు. రేంజికి మొత్తం 53 మందిని కేటాయించారు. వీరిలో 36 మంది పురుషులు, 17 మంది మహిళా ఎస్ఐలు ఉన్నారు. పోలీస్ శాఖలోకి నూతనంగా అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలకు ఆయన అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని, పోలీస్ శాఖ పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని సూచించారు. మొత్తం 53 మందిని జిల్లాల వారీగా ఇలా కేటాయించారు. గుంటూరుకు 22 మంది, పల్నాడుకు రూ.13 మంది, బాపట్లకు 10, ప్రకాశంకు ఒక్కరు, నెల్లూరుకు ముగ్గురు, తిరుపతికి నలుగురిని కేటాయించినట్టు ఐజి త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులిచ్చారు. ఈనెల 7వ తేదీ నుంచి వీరంతా విధుల్లో చేరాలని సూచించారు.



మహిళా ఎస్ఐకు నియామక పత్రం ఇస్తున్న ఐజి



కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్‌లో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా నరసరావుపేట పట్టణం గుంటూరు రోడ్డులోని హాస్పిటల్‌లో సోమవారం ఉచితంగా వినికిడి పరీక్షలు చేయనున్నట్లు కొండవీడు ముక్కు చెవి గొంతు హాస్పిటల్ అధినేత డాక్టర్ కందుల జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో వినికిడి లోపం గ్రహిస్తే చిన్నతనంలో అందుబాటులో ఉన్న అత్యాధునిక చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. పుట్టిన పిల్లలకు నెల రోజుల లోపు వినికిడి పరీక్షలు చేయించడం ద్వారా పుట్టుకతో వచ్చే చెవుడు మూగతనాన్ని అరికట్టవచ్చన్నారు. కాక్లియర్ ఇంప్లాటేషన్ ఆపరేషన్‌లు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అందిస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరం సందర్భంగా వినికిడి యంత్రాలు అవసరమైన వారికి 20 శాతం రాయితీపై అందజేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవర్షిణి, డాక్టర్ విష్ణురాజ్, మేనేజర్ మహేష్, అసిస్టెంట్ మేనేజర్ అశోక్, ఫార్మసిస్ట్ స్వామి పాల్గొన్నారు.

పైర్లకు నీటి ఎద్దడి

(మొదటి పేజీ తరువాయి)



ఆయకట్టు పరిధిలోవారాబందీ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌లో గరిష్టనీటి నిల్వ 312 టిఎంసీలు కాగా ప్రస్తుతం 165.23 టిఎంసిలు నీటి నిల్వ ఉంది. కుడి, ఎడమ కాల్వలకు కలిపి ప్రస్తుతం నిత్యం 16 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో మిర్చి, అపరాల పంటలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. మిర్చికి ఒక తడి అవసరం అని రైతులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అపరాలకు కూడా ఒక తడి అవసరం అవుతోంది. గత 65 రోజులుగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత పెరగడం వల్ల మిర్చిపంటను కాపాడుకునేందుకు రైతులునానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, కంది తదితర పంటలకు నీటి అవసరం ఎక్కువగా ఉంది. గుంటూరు, పల్నాడు జిల్లాలో రబీలో అపరాల సాగు కూడా తగ్గింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్‌లోనే 1.70 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఇంకా కాయ, పూత కొనసాగుతోంది.

గుంటూరు జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేశారు. జొన్న 32 వేల ఎకరాలు, మొక్కజొన్న 48 వేల ఎకరాలు, శనగ 17 వేల ఎకరాలు, పెసర 13 వేల ఎకరాలు, మినుము 14 వేల ఎకరాలు సాగు చేశారు. పొగాకు 9 వేల ఎకరాల్లో వేశారు. పల్నాడు జిల్లాలో 1.20 ఎకరాలల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. జిల్లాలో 48 వేల ఎకరాల్లో వరి, మరో 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 7 వేల ఎకరాల్లో కంది, పొగాకు 12 వేలు ఎకరాలు, మినుము 5 వేల ఎకరాలు, ఇతర పంటలు 32 వేల ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా ప్రస్తుతం పల్నాడు జిల్లాలో మిర్చి, శనగ, జొన్న, మొక్కజొన్న, వరి, కందితో పాటు వివిధ రకాల పంటలకు నీటి అవసరం ఏర్పడింది. పెదకూరపాడు, తాడికొండ, ప్రత్తిపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాలల్లోని పలు గ్రామాల్లో పంటలకు నీటి అవసరం పెరిగింది. రెండు జిల్లాల పరిధిలో కనీసం 10 రోజుల పాటు నీటి విడుదల పరిమాణాన్ని పెంచాలని రైతులు కోరుతున్నారు. గత 10 రోజులుగా ఎండ తీవ్రత పెరుగటం వల్ల చివరి భూముల పరిధిలోని పంటలు బెట్టకొచ్చే పరిస్థితి ఏర్పడింది.

పారిశ్రామిక సంస్థలను నెలకొల్పుతాం

ఏల్చూరి సన్మానసభలో కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామికీకరణపై దృష్టిపెట్టినట్టు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన్ మందిర్ లో ఆదివారం జరిగిన ఇది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్, గుంటూరు నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఏల్చూరి వెంకటేశ్వర్లు సన్మాన సభ కార్యక్రమానికి చంద్రశేఖర్ పాల్గొన్నారు. వ్యాపారులు తాము జీవిస్తూ పది మందికి ఉపాధి కల్పిస్తారని అలాగే పారిశ్రామిక వేత్తలు కూడా వేలాది మందికి ఉపాధి కల్పిస్తారని తెలిపారు. ఇదే రీతిలో జిల్లాలో మరిన్ని పరిశ్రమలు రావడానికి కృషి జరుగుతోందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులందరూ కలిసి సమిష్టి నిర్ణయం తీసుకుని చిన్న చిన్న వ్యాపారులకు బ్యాంకు రుణాలు ఇప్పించి తగిన తోడ్పాటును అందివ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమత, తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తూరు వెంకట్, పాల్గొన్నారు.


ఏల్చూరి వెంకటేశ్వర్లుసన్మానిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, నాయకులు

గ్రంధి వ్యాఖ్యల కలకలం

ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు ఆత్మీయ సమావేశంలో క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కు 34 సంవత్సరాలు అధ్యక్షుడిగా చేసిన ఆతుకూరి ఆంజనేయులు తీరును తప్పుపట్టారు. 34 సంవత్సరాలు ఆంజనేయులు ఛాంబర్‌కు చేసింది ఏమీ లేదని, ఛాంబర్‌ను నాశనం చేశాడని విమర్శించారు. ఛాంబర్ వ్యాపారులకు చేసింది ఏమి లేదన్నారు.ఆంజనేయులు నాయకత్వంలో ఛాంబర్ వ్యాపారుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. వ్యాపారులు ఛాంబర్ కు దూరమయ్యారని చెప్పారు. చాంబర్ కి వెళ్తే లిఫ్ట్ కూడా పనిచేయదని విమర్శించారు. ఇండియన్ ఛాంబర్ అవసాన దశకు ఉండేలా చేశారని మండిపడ్డారు. ఆతుకూరి కదలలేని పరిస్థితుల్లో, మాట్లాడలేని పరిస్థితుల్లో ఆ పదవి నుంచి తప్పుకున్నాడని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో కొత్త అధ్యక్షుని పదవి కత్తి మీద సామే అన్నారు. చాంబర్లో సభ్యత్వాలు తగ్గాయని, అవి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఛాంబర్ కు కొత్త నాయకత్వం రావడం ఆలస్యం అయిందని అన్నారు.

పేకాట డెన్‌పై దాడి

రూ.54,130 సొమ్ము స్వాధీనం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి సెంటర్ లోని ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట డెన్ పై తాడేపల్లి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ 54,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ నగరం నుండి గాక చుట్టుపక్కల నుండి పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు అందిన సమాచారంతో దాడులు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న వారిని కోర్టుకు హాజరుపెడతామని తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

రోడ్డు పక్కన మృతదేహం

ప్రజాశక్తి- తాడేపల్లి

నులకపేట ఐఓసీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన సుమారు 70 సంవత్సరాలు వయసు గల గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతో కూటమి నేతల అనైతిక చర్యలు

మహిళలను సైతం తిట్టి బయటకు లాగేసిన టిడిపి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున ఘటనలపై ఐద్వా ఖండన

ప్రజాశక్తి - సత్తెనపల్లి

ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మహిళలనూ సైతం దుర్భాషలాడుతూ పోలింగ్ కేంద్రాల నుండి బయటకు లాగేసి కూటమి నాయకులు యధేశ్చగా దొంగ ఓట్లు వేసుకున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విమర్శించింది. సంఘం పిల్నాడు జిల్లా కమిటీ సమావేశం స్థానిక పుతుంబాక భవన్‌లో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఎస్.దుర్గాబాయి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి.రజిని, రాష్ట్ర నాయకులు జి.ఉమశ్రీ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ టిడిపి ఎమ్మెల్యే, అ పార్టీకి చెందినవారు అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. పిడిఎఫ్ ఏజెంట్లుగా ఉన్నవారిలో మహిళలనూ సైతం ఇష్టారీతిన తిట్టారని, బయటకు పంపించి రిగ్గింగ్ చేసుకున్నారని, పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషించారని విమర్శించారు. ఈ చర్యలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల మహిళలకు ఒరిగిందేమీ లేదన్నారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో 16 రకాల నిత్యావసరాలను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా ప్రభుత్వాలు చూడ్డం వల్ల బెల్టుషాపులూ అధికమయ్యాయని, దీనివల్ల అనేక కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మద్యాన్ని నియంత్రించాలని కోరారు. సమావేశంలో నాయకులు డి.విమల, ఎం.జ్యోతి, జె.అనూష, డి.సుజాత, సుధారణి, నాగమ్మబాయి పాల్గొన్నారు.


ఐద్వా సమావేశంలో నాయకులు

రాష్ట్ర బడ్జెట్లో చేనేతలకు అన్యాయం

ప్రజాశక్తి మంగళగిరి

కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలు మరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నేతన్న నేస్తం పథకం అమలు చేస్తామని చెప్పి నిధులు కేటాయించక పోవడం శోచనీయమని తెలిపారు. ప్రభుత్వం పునరాలో చించి చేనేత కార్మికులకు రూ.2000 కోట్లు బడ్జెట్లో కేటాయించాలని పేర్కొన్నారు.

11 వ తేదీన శివాలయం టెండర్లు

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకానిలోని మల్లేశ్వర స్వామివారి 2025-26 సంవత్సరమునకు జరగవలసిన ఇ-టెండరు, సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలము పాటలు గతనెల 17వ తేదీన జరగవలసి వుంది. అయితే ఎన్నికల కోడ్ దృష్ట్యా వాయిదా పడ్డాయి. తిరిగి ఈ నెల 11వ తేదిన ఆలయ ప్రాంగణములో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించుట జరుగునని వేలం పాటలకు సంబం ధిం చిన వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించా లని ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన ప్రపంచ జ్ఞానం కలుగుతుందనీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు పేర్కొన్నారు. శాఖ గ్రంథాలయం పెదనందిపాడు నందు ఆదివారం చదవడం అంటే మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులలో సమర్థవంతంగా చదివే అలవాటును పెంపొందించడానికి, విద్యార్థుల్లో పఠన ఆసక్తిని పెంపొందించేందుకు పెదనందిపాడు శాఖా గ్రంథాలయం లో ప్రతి ఆదివారం విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడ తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ నీతి కథలు, కథనాలు, నీతి పద్యాలు, వంటి పుస్తకాలు చదవడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పుస్తక పఠనంలో నీతి కథలు చదివారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు గారపాటి రమేష్, వార్డు సభ్యులు వెలినేని శివయ్య, ఎన్ మల్లిక, జి. మంజుల పాల్గొన్నారు.



సిపిఎం అభిమాని కంచర్ల అగస్టీన్ కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఎంటీఎంసీ పరిధిలోని మెల్లంపూడి గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరులు కంచర్ల అగస్టీన్(62) శనివారం సాయంత్రం అనారోగ్యంతో ఆయన నివాసం లో కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమా రులు ఉన్నారు. అగస్టీన్ మృతి వార్త తెలుసుకున్న సిపిఎం సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం మెల్లెంపూడి గ్రామశాఖ కార్యదర్శి కంచర్ల సాంబశివరావు, నాయకులు కంచర్ల జేమ్స్, టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, బొమ్మా రెడ్డి శివ సాంబిరెడ్డి, అగస్టిన్ కుమారులు కంచర్ల సంసోన్, విజయ్‌కుమార్, ప్రవీణ్ కుమార్, కుటుంబ సభ్యులు అగస్టీన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.


హెల్మెట్ లేకుంటే జాతీయ రహదారిపైకి అనుమతి లేదు : సిఐ

ప్రజాశక్తి - పెదకాకాని

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుంటే పెదకాకాని మండల పరిధిలోని జాతీయ రహదారిపైకి అనుమతించేది లేదని సిఐ టి.పి నారాయణస్వామి ఆదివారం తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలోని ఎక్కువ శాతం మరణాలు తలకు దెబ్బతగలడం వల్లనే జరుగుతున్నాయని వారి కుటుంబాలలో తీరని శోకం మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జాతీయ రహదారి, సర్వీసు రోడ్లపై స్పీడ్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్ చేసేవారిపై ప్రత్యేక దష్టి సారించమన్నారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వాహనదారులకు హెల్మెట్ ధరించడం గురించి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని హెల్మెట్ ధరించని వారికి అపరాధ రుసుం వసూలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుశాఖ సిబ్బంది డెమో ప్రదర్శించారు.


హెల్మెట్ లేని వారిపై చర్యలు తీసుకుంటున్న సిఐ


డెమో ప్రదర్శిస్తున్న పోలీస్ సిబ్బంది



గోల్లపాడు కెజిబివి పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గోల్లపాడు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం పదో తరగతి విద్యార్థినులకు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. నరసరావుపేట పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ కుంచాల సురేష్ ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చగా ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా మహిళాభివృద్ధి – శిశు సంక్షేమ సాధికారత అధికారి ఆర్.అరుణ హాజరై మాట్లాడారు. అలసట లేకుండా ఆరోగ్యాన్నీ కాపాడుకుంటూ తగినంత సమయం నిద్రకు కేటాయించాలని చెప్పారు. లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక ప్రకారం అర్థం చేసుకొని చదవడం ముఖ్యమన్నారు. డాక్యుమెంట్ రైటర్ కుంచాల సురేష్ మాట్లాడుతూ జీవితంలో మొదటి పరీక్ష పదో తరగతని, శ్రద్ధ పట్టుదలతో చేసే ఏ పని అయినా విజయం సాధిస్తుందని అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ బాగా చదివి తల్లిదండ్రులకు గురువులకు పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ముందుగా నైటింగేల్ ఆఫ్ ఇండియా స్వాతంత్ర సమరయోధురాలు సరోజినీ నాయుడు వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ యూత్ కో-ఆర్డినేటర్ మురళి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి పాల్గొన్నారు.



రహదార్లపైనే మురుగు నీరు.. చెప్పినా పట్టించుకోని అధికారులు..

ప్రజాశక్తి - మాచర్ల : మడలంలోని లింగాపురంలో ఎస్సీల గృహాల వద్ద మురుగునీరు పారటం లేదు. సైడు కాల్వలు పూడిపోవటతో మురుగునీరు గృహాల ముందు, రోడ్లపై నిలిచి నడవాటానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు నిలిచిపోవటంతో తీవ్రమైన దుర్గంధం వస్తోంది. చెడు వాసనకు గృహాల్లో వుండలేక పోతున్నామని, దోమలు పెరిగి అనేక రోగాలకు కారణమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదుట కూడా మురుగునీరు నిలిచిపోయింది. దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులెవ్వరూ పట్టించుకోవటం లేదని, అధికారులకు ఎన్నోమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అసహనానికి గురవుతున్నారు.



పదో వార్డులో సమస్యలకు 4 దశాబ్దాల చరిత్ర


ప్రజాశక్తి- మాచర్ల రూరల్

- రోడ్లు, లైట్లు, డ్రెయినేజీలు లేవు
- కటిక చీకట్లలో రాకపోకలకు భయంభయం
- ఎన్నికలప్పుడు హామీలతోనే సరి..

పట్టణంలో ఎక్కువ ప్రజలు నివశించే పదో వార్డును సదుపాయాల లేమి నాలుగు దశాబ్ధాలుగా వేధిస్తోంది. ఈ వార్డులో నాలుగు వేల మంది వరకు నివశిస్తున్నారు. పాత రైలు కట్ట, సెరిన్ కాలనీ, కోడెల శివప్రసాద్ కాలనీ, ఎస్టీ కాలనీ ప్రాంతాలు ఈ వార్డు పరిధిలోనే ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితం నుండి ఈ ప్రాంతంలో ప్రజలు నివసిస్తున్నా వారికి సమస్యలను పరిష్కరించడానికి పాలకులు, అధికారులకు మనసు రావడం లేదు. సరైన రహదారులు లేవు. వీధి లైట్లు లేవు. మురుగునీరు పారుదలకు సైడు కాల్వలు లేవు. ఇలా అనేక సమస్యలతో స్థానికులు సహజీవనం చేస్తున్నారు. పాత రైలు కట్ట ఆనుకుని ఉన్న పట్టా భూముల్లో



సిసి రోడ్లు, సైడు కాల్వలు, వీధి దీపాలు లేని వార్డులోని పలు వీధులు





గృహ నిర్మాణాల్లేక పిచ్చికంప పెరిగి విష సర్పాలకు నిలయమైంది. ఆ చుట్టు పక్కల ఇళ్లలోకి తరుచూ పాములు, తేళ్లు వస్తున్నాయి. పాముకాటుతో చనిపోయిన సంఘటనలూ ఉన్నాయి. ఈ సమస్యపై ఈ 40 ఏళ్లలో స్థానికులు ఎన్నోసార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూసింది లేదు. తేరాల మైన్స్ రోడ్డులో ఇప్పటికి చాలా ఇబ్బందులు ఉన్నాయి. వార్డు పుట్టింది మొదలుకొని ఇంతవరకు రోడ్డు వేయలేదు. ప్రతి ఎన్నికల ముందు ఓట్ల కోసం వచ్చిన నాయకులు రోడ్డు వేస్తాం.. సమస్యలు పరిష్కరిస్తాం.. అని హామీ ఇవ్వటం.. మరిచి పోవటంతో స్థానిక ప్రజలు విసిగిపోయారు. ఈ రోడ్డులో వాహనాలు వెళ్లేటప్పుడు విపరీతంగా దుమ్ము ధూళి వస్తోంది. రోడ్డు మీద ఉండే రాళ్లు వాహనాల టైర్లు అంచులకు తగిలి రోడ్డుపై నడిచే వారికి తగిలి గాయాలు పాలవుతున్నారు.

పలు వీధుల్లో సరైన రోడ్లు లేవు. మురుగునీరు పారదలకు సైడు కాల్వలు లేకపోవటంతో గృహాల్లో వినియోగించే మరుగు నీరు రోడ్లపై పారుతోంది. తాగునీటి సమస్యతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడిప్పుడే ఎండలు తీవ్రమవుతున్నాయి. మార్చి నుండి పరిస్థితి మరింత దారుణంగా వుంటుంది. ఈ వార్డులో కనీసం వీధిలైట్లు లేవు. రాత్రి సమయాల్లో కాలనీవైపు రావాలంటే అందరికీ భయమే. అటుగా వెళ్తున్నవారిపై దుండగులు దాడి చేసి సైకిళ్ల, ద్విచక్రవాహనలు అపహరించుకొని పోయిన ఘటనలు అనేకం. ఆడపిల్లలు, స్త్రీలు ఒంటరిగా నడిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ట్యూషన్ చదువుకునే పిల్లలు రాత్రివేళ ఈ దారి గుండా ఇంటికి చేరుకోవటానికి భయపడి రింగ్ రోడ్డు మీదగా చుట్టూ తిరిగి వెళుతున్నారు. రాత్రి సమయాల్లో వీధిలైట్లు లేక చీకటిగా ఉండడంతో తాగుబోతులకు అడ్డాగా మారింది. ఎక్కడెక్కడో నుండి కుర్రకారు మద్యం, గంజాయి తాగటానికి ఈ ప్రాంతానికి వస్తున్నారు. ఇక్కడ గంజాయి విక్రయం జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఈ సమస్యలన్నింటినీ ప్రస్తుత పాలకులైనా పరిష్కరిస్తే బాగుండని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు

వ్యవసాయంలో నష్టం వచ్చి ఉన్న పొలం అమ్ముకుని మాచర్ల మండలం ద్వారకపూరి నుండి 15 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి ఉంటున్నాం. ప్రస్తుతం భవననిర్మాణ పనులకు పోతున్నాను. కాలనీలో అన్ని సమస్యలే. పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇంత వరకు పరిష్కారం కాలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా మా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో ఎదురు చూస్తున్నాం.



ఉప్పతోళ్ల ఆంజనేయులు, 10వ వార్డు, మాచర్ల.

రాత్రి వేళల్లో భయంగా ఉంటుంది

ఈ కాలనీలో పదేళ్ల నుండి కాలనీలో ఉంటున్నాం. ఇప్పటి వరకు వీధి లైట్లు లేవు. రాత్రి సమయంలో కటిక చీకటిగా ఉండి నడవటానికి భయంగా ఉంటుంది. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి కంపచెట్లు పెరిగాయి. అప్పుడప్పుడు తేళ్ళు, పాములు వస్తూంటాయి. కొన్ని బజార్లకు కరెంటు స్తంభాలే లేవు. ఉన్న స్తంభాలకు లైట్లు లేవు.



బత్తుల జ్యోతి. కోడెల శివప్రసాద్ కాలనీ, మాచర్ల

రాళ్లు తగిలి పడిపోతున్నాం

ఈ కాలనీలో నివాసం ఉండబట్టి ఏడేళ్లయింది. ఇంత వరకు రోడ్లు లేవు. ఇదంతా రాయి ప్రాంతం కావటంతో రోడ్లపై పెద్దపెద్ద గుండ రాళ్ళ ఉంటున్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. కాళ్లకు ఆ రాళ్లు తగిలి కిందపడి గాయాలు అవుతుంటాయి. సైడు కాల్వలు లేకపోవటంతో ఇళ్లల్లో వాడిన మురుగునీరు ఇంటి ముందు పారుతుంది. తిరిగే రోడ్ల పై మురుగునీరు నిలిచి చెడు వాసన వస్తుంది.



బత్తుల కుమారి. కోడెల శివప్రసాద్ కాలనీ, మాచర్ల.

ఉపాధ్యాయిని డాక్టర్ ఎంబి.చిన్నమ్మకు ఘనసత్కారం

ప్రజాశక్తి- రెంటచింతల



డాక్టర్ ఎంబి చిన్నమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ఉద్యోగ విరమణ అనేది వృత్తికేనని, వ్యక్తిత్వానికి కాదని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో 30 ఏళ్లపాటు ఉపాధ్యాయినిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న డాక్టర్ ఎంబి.చిన్నమ్మ వీడ్కోలు సభ ఆదివారం నిర్వహించారు. సభకు ఎంఈఓ-2 శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎంతో పట్టుదలతో వ్యవహరించే వారిని పేర్కొంటూ తన సర్వీసులో ఐదు సార్లు అవార్డులను అందుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు డాక్టర్ చిన్నమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఫాదర్లు వైయల్. మర్రెడ్డి, భరత్‌రెడ్డి, నాగయ్య, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి.ప్రేమ్‌కుమార్ జాన్, విజయ, రాజ్ కుమార్, నాసరయ్య, బుచ్చిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసాలు ప్రారంభం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలో ముస్లిములు ఉపవాస దీక్షల ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం నమాజులో అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎమ్‌డి ఉస్మాన్ మేస్త్రి ఆధ్వర్యంలో పెద్ద మసీదు ఇమామ్ దువా చేస్తూ, దేశ సమగ్రతకు, శాంతి స్థాపనకు, రాష్ట్ర అభివృద్ధికి అల్లాహ్ తోడ్పడాలని దువా చేశారు. అనంతరం వారంతా ఒకచోటకు చేరి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి, పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎమ్‌డి గఫార్, ఆఫీస్ అబ్దుల్ ఖాదర్, కమిటీ సభ్యులు షేక్ గౌస్‌బాబు సాహెబ్, ఫరీద్ మేస్త్రి, జానీబాబు, అబ్దుల్ కరీం, మునీర్, జిలాని, బాష, లతీఫ్, ఖాసిం పాల్గొన్నారు.



12న విజయవాడలో మహాధర్నా జయప్రదం చేయండి : వ్యకాస

ప్రజాశక్తి దుగ్గిరాల

ఉపాధి హామీ పనులను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, సమస్యల పరిష్కారం కోసం 12న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పనిదినాలు, సమ్మర్ అలవెన్స్, పే స్లిప్‌లు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు కోట్లమంది పేదలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వీరికి సొంత ఆస్తులు లేక చదువుకున్న వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిత్యం పొట్టకూటి కోసం ఏ పని దొరికితే ఆపనికి వెళుతున్నారన్నారు. డిగ్రీ, పీజీ చదువుకున్న పిల్లలు కూడా అటో, భవన నిర్మాన, ఉపాధి పనులకు వెళుతున్నారన్నారు. ఆ



ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పనుల్లోకూడా పోటీ పెరిగి చేతినిండా పని దొరకక దూర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వలస వెళ్లిన కూలీలకు పెద్దఎత్తున ప్రమాదలు జరిగి వారి కుటుంబాలు దిక్కులేని అనాథలుగా మారుతున్నారన్నారు. ఈ దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న పేదలసమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. పేదలకు అన్నం పెట్టే ఉపాధి చట్టానికి బిజెపి ప్రభుత్వం నిధులు తగ్గించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేసి పేదల పొట్టకొడుతుందన్నారు. వలస కార్మికులకు ఉచితంగా రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్‌బండ అందించాలని, ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు నగదు, రెండెకరాల భూమి, ప్రతి పేదకుటుంబానికి ఏడాదికి రూ.12వేలు నగదు, 3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6లక్షల నగదుతో పాటు ప్రతి దళిత కాలనీకి 2 ఏకరాల స్మశాన స్థలం, ఉపాధి మేట్లకు రూ.5పారితోషకం ఇవ్వాలని తదితర డిమాండ్‌లు సాధించుకోవడానికి మార్చి 12న విజయవాడలో భారీ ధర్నా చేపట్టామన్నారు. కార్మికుల హక్కుల సాధనకు మార్చి 12న విజయవాలో నిర్వహించే మహాధర్నాను పెద్దఎత్తున హాజరవ్వాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జెట్టి బాలరాజు, నాయకులు ఎం యోగేశ్వరరావు, అమ్మిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పోలీస్ నిఘా



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆధునిక పరిజ్ఞానంలో భాగంగా డ్రోన్ కెమెరాల సహాయంతో మంగళగిరి మండలం కాజ గ్రామ పరిధిలో గల టోల్ ప్లాజా వద్ద విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం వాహనాల తనిఖీ చేయడం జరిగినది. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించరాదని, ఇతర వాహనాల నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించవలెనని తెలిపారు. వాహనాలు తనిఖీ సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాల సహాయంతో అతివేగంగా నడిపే వాహనాలను మరియు ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులను పేకాట మరియు ఏ ఇతర



సాంఘిక కార్యక్రమాలు పాల్పడిన వ్యక్తులను పట్టుకుని సహాయపడతాయని తెలిపారు. ప్రజలందరూ ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలి

భూ దందాలు, సెటిల్మెంట్లు, గొడవలకు దిగితే కఠిన చర్యలు

నార్త్ సబ్ డివిజన్ డిఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడకూడదని నార్త్ సబ్ డివిజన్ డిఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన మెలగాలి, ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడకూడదని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, దౌర్జన్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, అలాగే గ్రామీణ ప్రాంతాలలో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా



ఉండాలని నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ హెచ్చరించారు. అలా కాకుండా గొడవలు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన రౌడీ షీటర్లను హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు, రౌడీయిజానికి పాల్పడినట్ల యితే గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్, ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివి హాస్పిటల్లో అరుదైన శస్త్రచికిత్స

రోగి కడుపు నుంచి 5 కిలోల కణితి తొలగింపు

పది రోజుల క్రితం గర్భాశయంలో ఏడు కిలోల ఫైబ్రాయిడ్‌ను తొలగించిందీ ఇక్కడే

ప్రజాశక్తి తెనాలి

ఆధునిక వైద్యవిధానంలో వైద్యులకు పెను సవాళ్లే ఎదురవుతున్నాయి. మనుషులు తీసుకునే ఆహారంలో మార్పులు కావచ్చు.. లేదా కోవిడ్ అనంతర పరిణామాలలో మనుషుల ఆరోగ్య పరిస్థితిలలో మార్పయితేనేమి... మొత్తం మీద వెలుగు చూస్తున్న అరుదైన పరిస్థితులు వైద్యులకు సవాల్ గానే నిలుస్తున్నాయి. దానికి తగినట్టే చికిత్స విధానాలలో అత్యాధునిక పరిస్థితులు చోటు చేసుకుంటు న్నాయి. ఇప్పటివరకు కళలు, క్రీడలు, విద్య, రాజకీయ రంగాలలో అగ్రగామిగా నిలుస్తున్న ఆంధ్ర పారిస్ ఇప్పుడు వైద్యరంగంలో కూడా దీటైన పాత్ర పోషిస్తుంది. దీనికి చిరునామాగా దివి హాస్పిటల్ వైద్యులు, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఉదయభాస్కర్ చందు వరుసగా చేసిన అరుదైన శస్త్ర చికిత్సలు ఉదాహరణగా చెప్పొచ్చు. వివరాలలోకి వెళితే గతంలో ఏదైనా అరుదైన ఆపరేషన్ అంటే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి మహా నగరాలకు రోగులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. కానీ వైద్యరంగంలో చోటు చేసుకున్న అత్యాధునిక చికిత్స విధానాలను సొంతం చేసుకుంటూ తెనాలి ప్రాంతంలో వైద్యులు తమ సత్తా చాటుతున్నారు. పెను సవాలుగా నిలిచిన అరుదైన రోగుల విషయాలలో విజయవంతంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. పట్టణ ంలోని ప్రకాశం రోడ్డులో గల దివి హాస్పిటల్లో వరుసగా



శస్త్రచికిత్స చేసిన వైద్యులు ఉదయ భాస్కర్ చందు

రెండు అరుదైన శస్త్ర చికిత్సలను డాక్టర్ ఉదయ భాస్కర్ చందు విజయవంతంగా పూర్తి చేశారు. గత పది రోజులు క్రితం మహిళ గర్భాశయంలో ఏర్పడిన 7.2 కేజీల ఫైబ్రాయిడ్ ను హిస్టరెక్టమీ ఆపరేషన్ ద్వారా తొలగించిన సంగతి విధితమే. తాజాగా మరో రోగి కడుపు నొప్పితో బాధపడుతూ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. వివిధ రకాల వైద్య పరీక్షలు, స్కానింగ్ అనంతరం కడుపులో కణతి ఉన్నట్లుగా వైద్య బందం గుర్తించింది. ఆసుపత్రి వైద్య సిబ్బందితో కలిసి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఉదయభాస్కర్ చందు కొన్ని గంటలు శ్రమించి రోగి కడుపులో ఉన్న 5.1 కేజీల కణితిని శస్త్ర చికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ సాధారణంగా ఇలాంటి



తొలగించిన కణితి

కణతులు అరుదుగా కనిపిస్తాయని, వీటిని తొలగించటం అరుదైన ఆపరేషన్ గా చెప్పారు. ఆపరేషన్ సమయంలో రోగికి అధిక రక్తస్రావం అయ్యే ప్రమాదం కూడా ఉందని, దానిని కూడా నియంత్రిస్తూ ఆపరేషన్ కొనసాగించినట్లు చెప్పారు. వైద్య రంగంలో వచ్చిన అత్యాధునిక వైద్య సదుపాయం, లేబరేటరీ, అనుభవజ్ఞులైన వైద్య బందం ఆసుపత్రిలో ఉందన్నారు. సమిష్టి సహకారంతో రోగి పరిస్థితిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, తగిన వైద్య పరీక్షల అనంతరం, శస్త్ర చికిత్సను అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించి విజయం సాధిస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యం కుదుటపడిందని, త్వరితగతిన కోలుకుంటున్నట్లు చెప్పారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు వైద్యశాలలో అందుబాటులో ఉన్న చికిత్స విధానాలను సద్వినియోగం చేసుకోవాలని, మహానగరాలతో పోలిస్తే అతి తక్కువ ఖర్చుతో శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను ఆసుపత్రి వైద్య బందంతో పాటు పట్టణంలోని పలువురు వైద్యులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆస్తి పన్ను నూరు శాతం వసూలు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను నూరు శాతం వసూళ్ల జరగాల్సిందేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం కమిషనర్ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో పన్నుల వసూళ్లపై మాట్లాడారు. మార్చినెల ప్రారంభమైనందున రెవెన్యూ విభాగంలోని ప్రతి అధికారి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ అన్నారు. పన్ను బకాయి ఉన్న ప్రైవేట్ ఆస్తులలో రూ.165 కోట్లకుగాను ఇప్పటి వరకు రూ.90 కోట్లు వసూళ్ల జరిగిందని, మార్చి చివరికి మరో రూ.50 కోట్లు వసూళ్ల చేయాలన్నారు. పన్ను వసూళ్లకు రెవెన్యూ ఇన్స్పెక్టర్, రెవెన్యూ అధికారి, డిప్యూటీ కమిషనర్ల వారీగా రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించామని, అందుకు తగిన విధంగా క్షేత్ర స్థాయిలో వసూళు జరగాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వాటికి డిప్యూటీ కమిషనర్లు భాధ్యత తీసుకోవాలని, పన్ను వసూళ్లు అధిక ప్రాధాన్యత అయినందున విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గుంటూరు నగర ప్రజలు తమ ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి చార్జీలను సకాలంలో చెల్లించాలని, తద్వారా నగరంలో అభివద్ధి పనులు వేగంగా జరిగేందుకు వీలు కలుగుతుందన్నారు. ఇప్పటికే 2024-25 రెండవ అర్ధ సంవత్సరం చివరికి వచ్చామని, నెలాఖరు వరకూ వేచి ఉండకుండా నగరపాలక సంస్థకు బకాయిలు మొత్తం చెల్లించాలని, ఏప్రిల్ 1 నుండి పన్నుపై నెలకు రూ.100కు రూ.2 వడ్డీ జమ అవుతుందన్నారు. మార్చిలో సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యధావిగా పనిచేస్తాయని, పన్నులను జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140 సచివాలయంలోని క్యాష్ కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు. పనులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధి సహకరించాలని ప్రజల్ని కోరారు.

బడ్జెట్‌లో రైతులకు మొండిచేయి

ఎపి రైతుసంఘం విమర్శ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వ్యవసాయ బడ్జెట్ రైతులకు మేలు చేసేవిధంగా లేదని ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ధాన్యం, మిర్చి, కంది, శనగ పంటలకు ధరలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకునేందుకు ధరల స్థిరీకరణకు సంబంధించి రూ.3 వేల కోట్లు కేటాయించాల్సి వుండగా, కేవలం రూ. 300 కోట్లు విదిల్చిందని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందని చెప్పి, ఇప్పుడు కేంద్రంతో కలిపి ఇస్తామనడం రైతాంగాన్ని మోసగించడమే అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కౌలు రైతులకు నూతన చట్టం తీసుకు రావాలని కోరారు. పంటరుణాలు, పరిహారం, పంటల భీమాపై ప్రభుత్యం సష్టత ఇవ్వాలని ఆయన తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌పై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన సోమవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో 2025-26 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహి స్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి, టిడిపి సీని యర్ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు జూపూడి రంగరాజు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలీ తదితరులు ప్రసంగిస్తారన్నారు. ప్రజా సంఘాలు, మేధావులు, పౌర సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న బొల్లు కృష్ణారావు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేద విద్యార్థినికి బొల్లు రాజేశ్వరి కృష్ణారావు ఛారిట బుల్ ట్రస్ట్ రూ 20 వేలు ఆర్థిక సాయం అందజేసింది. తెనాలికి చెందిన రావి యామిని చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ చివరి ఏడాది చదువుతుంది. తల్లిదండ్రు ల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కళాశాల ఫీజులు చెల్లించి లేక ఇబ్బం దులు పడుతూ సన్నిహితుల ద్వారా బొల్లు రాజేశ్వరి కృష్ణా రావు ఛారిటబుల్ ట్రస్ట్ నుండి సహాయం కొరకు దర ఖాస్తు చేసుకుంది. స్పందించిన ట్రస్ట్ వ్యవస్థాపకులు కృష్ణా రావు యామిని చదువుకు ఎటువంటి ఆటంకం లేకుండా కొన సాగేందుకు ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. తమ ట్రస్ట్ తరపున ఇప్పటికి ఎందరో విద్యార్థులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. సహాయం కోసం దరఖాస్తు చేసు కున్న ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ వంతు సహాయ సహ కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వర్లు బొల్లు రాజేంద్ర ప్రసాద్,మర్లపాటి రామకృష్ణ పాల్గొన్నారు.


తండావాసులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సారా తయారీదారులపై చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి మండలంలో సారాయి తయారీ అనుమానిత ప్రాంతాలలో ఎక్సైజ్ అడాప్షన్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా తండా వాసులతో ఆయన మాట్లాడుతూ సారాయి తయారు చేయ డం, రవాణా చేయడం, కలిగి ఉండటం, సారాయి విక్రయించడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. నాటు సారాయి గురించి ఏవైనా సమాచారం ఉంటే తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు.

సౌత్ జోన్ క్రీడలకు బాలికలు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం

జిల్లా స్థాయిలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి స్థానంలో నిలిచి సౌత్ జోన్ లో క్రీడా పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారు. గత రెండు రోజులుగా కేసరపల్లి వెటర్నరీ కాలేజీలో జరుగుతున్న హిల్ ఫౌండేషన్, హెచ్‌సిఎల్ కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్న క్రీడ పోటీల్లో గన్నవరం జడ్పీ బాలికలు హ్యాండ్ బాల్‌లో ప్రతిభ కనబరిచారు. వీరు బెంగళూరులో జరిగే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. అలాగే ఫుట్బాల్ లో రన్నర్స్ గా గన్నవరం జడ్పీ బాలికలు నిలిచారు. షాట్ పుట్ లో సెకండ్ ప్లేస్, క్యారమ్స్ లో సెకండ్ ప్లేస్ రావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుగ్గిరాల ఝాన్సీ రాణి చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చినా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గీత అభినందించారు.

వ్యర్థాలతో పూడుకుపోతున్న చంద్రవంక వాగు


వాగులో పోసిన వ్యర్థాలు

ప్రజాశక్తి - మాచర్ల

చారిత్రికంగాను, సాంస్కృతికంగాను ఘనచరిత్ర ఆ వాగు సొంతం... కవి సార్వభౌముడు శ్రీనాధుడుచే చంద్ర భాగీనది అని కీర్తింపబడిన చంద్రవంక వాగు నేడు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతూ నాటి చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని కోల్పోయింది. ఒకప్పుడు మాచర్ల పట్టణ వాసులం దరికీ త్రాగునీరు అందించిన చంద్రవంక వాగు నేడు కాలుష్యానికి సాకారంగా మారింది. 50 ఏళ్ళ కిందటి వరకు స్వచ్ఛమైన నీళ్ళు పారుతుండేవి. ఈ వాగు తూర్పు నుండి పడమర వైపు ప్రవహిస్తూ చారిత్రక చెన్నకేశవస్వామి దేవస్థానం పక్కగా పారి సుమారు 8 కిలోమీటర్లు దూరంలో నున్న ఎత్తిపోతల జలపాతంలో నుంచి కృష్ణానదిలో కలుస్తుంది. తగినంత వర్షపాతం లేకపోవటం, పెరిగిన జనాభా, స్వార్ధపరుల కబ్జాలతో చంద్రవంక తన ప్రభావాన్ని కోల్పోయిందని చెప్పవచ్చు. పట్టణంలోని గృహాలు, వ్యాపార సముదాయాల్లో వినియోగించే మురుగునీరు మొత్తం చంద్రవంకలోనే కలుస్తోంది. దీనితోడు పలు హోటళ్లు, వ్యాపార సముదాయాల్లోని, కొబ్బరిబోండాల వ్యాపారులు, మాంసం దుకాణదారులు వేసే వ్యర్థాలు, ఏదైన కూల్చిన భవనం తాలూకా వ్యర్థాలు చంద్రవంకలోనే పోస్తున్నారు. దీనికి తోడు స్వార్ధపరులు చంద్రవంక ఇరువైపుల భూము లను ఆక్రమించి ఇటుక బట్టీలు ఏర్పాటు చేయటంతో వాగు కుంచించుకుపోయింది. ఇప్పుడు కేవలం గృహాల్లో వినియో గించే మురుగునీరు మాత్రమే వాగులో పారుతుండడంతో దోమలకు

దుర్గంధంగా మారిన వాగు

ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఈ కాలుష్య ప్రభావం పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతల జలపాతం మీద కూడా పడుతోంది.

వ్యర్థాలు వాగులో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...

ఎంతో ఘన చరిత్ర కలిగిన చంద్రవంక వాగును మురుగుకాల్వగా మార్చారని దీని చరిత్ర తెలిసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని డ్రైనేజీల నుండి వచ్చే మురుగునీరు మొత్తం చంద్రవంక వాగులో కలిసే ముందు శుభ్రపడేలా చూడాలి. మాంసంపు వ్యర్థాలు, చెత్తాచెదారాలు వాగులో వేయకుండా చూడాలి. వాగులో పేరుకుపోయిన మురుగును, పెరిగిన పిచ్చికంప చెట్లను, గుర్రపుడెక్కను, వాగుకు ఇరువైపులా వున్న ఆక్రమణలు తొలగించాలి. వాగు ఒడ్డునే వాకింగ్ ట్రాకింగ్ ఏర్పాటు చేస్తే ఎంతో మందకి ఉపయోగకరంగా ఉంటుంది. మాచర్ల పట్టణంలో సాయంత్రం, సెలవు రోజుల్లో విహారంగా వెళ్ళేందుకు సరైన పార్కు కూడా లేదు. వాగు వెంట పూలమొక్కలు నాటి పార్కుగా మారిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.


వ్యర్థాలతో పూడిపోతున్న వాగు

ఒత్తిడిని జయించేందుకు ధ్యానం,యోగ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అధిక ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉంటారని, యోగా, ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని పల్నాడు జిల్లా అదనపు ఎస్.పి జెవి.సంతోష్ అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా ఆదివారం పల్నాడు జిల్లా ఎస్.పి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా పోలీస్ పరేడ్ ప్రాంగణంలో అదనపు ఆధ్వర్యంలో యోగా, ధ్యాన కార్యక్రమం జరి గింది. ఈ సందర్భంగా మహిళా పోలీసు, సచివాలయం మహిళా పోలీసులకు యోగా, ధ్యానం గురూజీ జనార్ధనరావు వారి సిబ్బంది పర్యవేక్షణలో యోగ, ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్.పి మాట్లా డుతూ యోగ ధ్యానం ద్వారా ఒత్తిడి అధిగమించేందుకు దోహదపడ డంతో పాటు ఆరోగ్యం, పనితీరును మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుం దన్నారు. గుండె జబ్బులు, ఊబకాయం, మధుమేహం, ఆందోళన, ఒత్తిడి సంబం ధిత అనారోగ్యాలను అధిగమించి శారీరక బలం మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్.పి ఎం. వెంకటరమణ మహిళా పోలీసులు పాల్గొన్నారు.


యోగ చేస్తున్న పోలీసు సిబ్బంది

లింగంగుంట్ల అగ్రహారం భూములకు మహర్దశ

త్వరలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యలు పరిష్కరిం చాలని పీఠాధిపతులను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం హైదరాబాద్ పుష్పగిరి మఠంలో పీఠాధిపతు లను కలిసి కోరారు. త్వరలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టాలని అభ్యర్ధించగా పీఠాధిపతులు కొన్ని షరతు లు విధించినట్లు సమాచారం. ఎట్టకేలకు ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థనకు పీఠాధిపతులు సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో లింగంగుంట్ల అగ్రహారం భూములు రిజిస్ట్రేషన్లకు ముహూర్తం ఖరారు చేస్తామని ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆహ్వానిస్తామని ఎంపి, ఎమ్మెల్యే పేర్కొన్నారు.


పీఠాధిపతులను కలిసిన అనంతరం ఎంపి, ఎమ్మెల్యే

ఎంపి ఎమ్మెల్యేతో పాటు లింగంగుంట్ల గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి కోసం పేదరాలికి తోపుడు బండి అందజేత

ప్రజాశక్తి - మాచర్ల :

మాచర్ల శ్యాసనసభ్యులు జులకంటి బ్రహ్మనంద రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పవిత్ర రంజాన్ మాసంలో సైదబి (మట్టమ్మ) ఉపాధి కొరకు నూతన టిఫిన్ బండిని అందించారని టిడిపి నాయకులు షేక్ మోసిన్ తెలిపారు. ఆదివారం సైదబికి తోపుడు టిఫిన్ బండిని టిడిపి నాయకులు అందించారు. ఈ సందర్భంగా మోసిన్ మాట్లాడుతూ మంత్రి నారాలోకేష్ స్ఫూర్తితో సైదబి ఉపాధి నిమిత్తం సహాయం చేస్తానని ఎమ్మెల్యే బ్రహ్మా నందరెడ్డి హామి ఇచ్చారని ఈ మేరకు ఆమెకు బండిని ఇవ్వటం జరిగిందన్నారు. తమ కుటుంబానికి అండగా నిలిచిందుకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సైదబి కృతజ్ఞలు తెలిపారు. ఈ కార్య క్రమం లో టిడిపి నాయకులు షేక్ అన్వర్, భద్రు తదితరులు పాల్గొన్నారు.




తోపుడు బండి ఇస్తున్న టిడిపి నాయకులు

తాడేపల్లిలో డ్రైనేజీ అస్తవ్యస్తం

నిలిచిన మురుగు - ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో మునిసిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని సగభాగం డ్రైనేజీలో మురుగు నీరు నిలిచిపోయింది. రైల్వే అధికారులు రైల్వే స్థలాన్ని ఓ కాంట్రాక్టరుకు లీజ్‌కు ఇవ్వటంతో ఆయన ఆదివారం ప్రోక్లైనర్‌తో అ ప్రాంతాన్ని చదును చేశారు. లీజుకు ఇచ్చిన స్థలంలోనే మున్సిపాలిటీకి సంబంధించిన డ్రైనేజీ కాలువ ఉంది. ఈ కాలువ విజయవాడ- చెన్నై రైల్వే లైన్ పట్టాలు కింద గేటు అవతల వైపుకు వెళుతుంది. అక్కడ నుండి కళావేదిక పక్కగా బకింగ్గాహం కెనాల్ కాలువలో కలుస్తుంది. తాడేపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్, పోలీస్ స్టేషన్ వెనుక బజార్, వెంకయ్యకొట్టు సెంటర్, పద్మశాలీయ బజార్, నెహ్రూ బొమ్మసెంటర్, కొండ ప్రాంతాలలో ప్రజలు నివసిస్తున్న చోటికి నీరంతా కాలవలు ద్వారా కలుస్తుంది. ప్రస్తుతం రైల్వే స్థలంలో ఉన్న కాలువను పూర్తి చేయటంతో ఎక్కడికక్కడ డ్రైనేజీ వ్యవస్థ నిలిచిపోయే ప్రమాదం ఉంది. తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని మెయిన్ రోడ్‌లో డ్రైనేజీ కాల్వలో నుండి మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమై అంటురోగాలు ప్రబలుతాయేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 50 సంవత్సరాల నుండి తాడేపల్లి పట్టణంలోని కొన్ని ఏరియా నుండి వస్తున్న మురుగునీరు రైల్వే స్థలంలో ఉన్న డ్రైనేజీ కాలువ దాటి, రైలు పట్టాల కిందగా బకింగ్ హామ్ కాలువ లోకి వెళ్తుంది. రైల్వే అధికారులు లీజు పేరుతో స్థలాన్ని కాంట్రాక్టరుకు కట్టబెట్టడం, సదర్ కాంట్రాక్టర్ డ్రైనేజీ కాలువ ఆనవాళ్లు కూడా లేకుండా పూడ్చి చేయడం పట్ల ప్రజలకు ఆగ్రహా వేషాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రైల్వే, మున్సిపల్ అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



నిలిచిన మురుగ నీరు



పూడుకుపోయిన కాల్వ

సిపిఎం నాయకులు పోతురాజుకు నివాళి

ప్రజాశక్తి దుగ్గిరాల

ప్రజాసమస్యలపై అహర్నిశలు కృషి చేసిన సిపిఎం సీనియర్ నాయకుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు అర్పించే నివాళి అని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. ఆదివారం దుగ్గిరాలలో గ్రామానికి చెందిన సీనియర్ సిపిఎం నాయ కుడు చొక్కాకుల పోతురాజు సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం చేస్తున్నప్పటికీ పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనే వారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం 78 సంవత్సరాల వయసులో కూడా జెండా భుజాన వేసుకొని చురుకుగా ప్రజాపోరాట కార్యక్రమాల్లో పాల్గొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జట్టి బాల రాజు, వై బ్రహ్మేశ్వరరావు వెంకటేశ్వరమ్మ అమ్మిరెడ్డి అద్దంకి పాములు ఎన్ యోగేశ్వర రావు చొక్కాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ఊపిరితిత్తుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-గుంటూరు

మన శరీరానికి ఆక్సిజన్ అందిస్తూ శరీరంలోని కార్బన్ డయాక్సైడ్‌ని బయటికి పంపటంలో ప్రముఖపాత్ర పోషించే ఊపిరితిత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.రఘు అన్నారు. అవగాహన ఆధ్వ ర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయం లో ఊపిరితిత్తుల సమస్యలపై నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ రఘు మాట్లాడుతూ ఊపిరితిత్తులు ఆరోగ్యంగా లేని సందర్భాలలో శరీరంలో అవయవాలకు సరైన ఆక్సిజన్ అందక మిగిలిన అవయవాలు కూడా దెబ్బతిని రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. మద్యపానం, ధూమపానం లాంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకుంటే మంచి దన్నారు. నెమ్ము సమస్య గురించి మాట్లా డుతూ నిమో పోకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని 60 సంవత్సరంలో లోపువారు ఈవ్యాక్సిన్ రెండు పర్యాయాలు తీసుకోవాలని, 60 సంవత్సరాలు పైబడిన వారు ఒక డోస్ తీసుకుంటే సరిపోతుందని చెప్పారు. ఊపిరితిత్తులకు వ్యాధి సోకితే దగ్గు, దగ్గినప్పుడు కళ్లె పడటం, రక్తం పడటం, చాతిలో నొప్పి, ఆయాసం, పిల్లి కూతలు వంటి లక్షణాలు కనబడతాయని, వెంటనే డాక్టర్‌ను సంప్రదించి నయం చేసుకోవచ్చని సూచించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డి నేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు అవగాహన సీనియర్ సభ్యులు ఎన్.సాంబ శివ రావు, పాములరెడ్డి, ఆర్.రామచంద్రరావు ప్రసంగించారు.



ఆరోగ్య సభలో మాట్లాడుతున్న డాక్టర్ రఘు

దశ, దిశ లేని బడ్జెట్ : వైసిపి

ప్రజాశక్తి మంగళగిరి

కూటమి ప్రభుత్వం ఆసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దశ, దిశ లేదనీ, అంతా అభూత కల్పనే అని వైఎస్సార్సీపీ మంగళ గిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్ పేదలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలకు బడ్జెట్లోలో అరకొర నిధులు కేటా యించి పేద లను మోసం చేశారని తెలిపారు. ఆడబిడ్డ నిధి ఊసే లేదనీ, మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో రూ.31వేల కోట్లు అప్పు చేస్తున్న ప్రభు త్వం పేదల సంక్షేమ పథకాలకు సరైన నిధులు ఎందుకు కేటాయించలేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో చంద్రబాబును, లోకేష్ పొగడడానికే సరిపోయిందని అన్నారు. 9నెలల పాలనలో రూపాయి కూడా సంక్షేమానికి ఖర్చు చేయని కూటమి సర్కార్ లక్ష కోట్లు అప్పు చేయడం ఆసలైన ఆర్థిక అరాచకమని తెలిపారు.

రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా

- పద్ధతి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు : హెచ్చరించిన డిఎస్‌పి

ప్రజాశక్తి తెనాలి

రౌడీ షీటర్ల ప్రతికదలికపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, పద్ధతులు మార్చుకోకుంటే ఎదురయ్యే పరిణామాలకు వారే బాధ్యులని డిఎస్‌పి బి జనార్ధనరావు హెచ్చరించారు. పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సిఐ ఎస్ రమేష్ బాబు ఆధ్వర్యంలో డిఎస్పి కార్యాలయంలో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలో మొత్తం రౌడీషటర్లు, వారు గతంలో పాల్పడిన నేరాలు, దానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న కేసులు, ఇటీవల జరిగిన ఘటనలలో రౌడీషీటర్ల పాత్ర, ఇతర వివరాలను సీఐ ద్వారా డి.ఎస్.పి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌర్జన్యాలు, సెటిల్మెంట్లు, భౌతిక దాడులు ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలను చట్టం సహించబోదన్నారు. ముఖ్యంగా రౌడీ షీటర్లు ఇలాంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. తాత్కాలిక ప్రయోజనం కోసం రౌడీ షీటర్లు విర్రవీగితే, భవిష్యత్ ప్రశ్నార్ధ కంగా మారుతుందని, కుటుంబ సభ్యులు కూడా సమాజంలో ఇబ్బంది పడే పరిస్థితులు ఎదురవుతా యని మందలించారు. పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో సిఐతోపాటు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న డిఎస్‌పి జనార్ధనరావు



దీక్షల్లో కూర్చున్న కార్మికులు

కార్మికుల జీవితాలతో చెలగాటమాడొద్దు : సిఐటియు

ప్రజాశక్తి- తాడేపల్లి

కడుపు గాలి, ఇబ్బందులు పడుతున్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో యాజమాన్యం, ప్రభుత్వం చెలగాట మాడొద్దని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఆదివారం నాటికి దీక్షలు 89వ రోజుకు చేరుకున్నాయ. దీక్షలను దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. దీక్షలో వి నవనీతం, వేముల లక్ష్మి, ఎం శారద, సామ్రాజ్యం, శారమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, సత్య ప్రకాష్, అంకయ్య, కృష్ణ, గురవయ్య, డి మాణిక్యరావు, యెహెూషువ, సాంబయ్య, రమాదేవి పాల్గొన్నారు.

పారిశుధ్యకార్మికుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్రంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూపారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ఆప్కాస్ విధానాన్ని తొలగించి కార్మికులను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చి కాంట్రాక్ట్ విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులకు అప్కాస్ విధానంలోనే వేతనాలు ఇచ్చే విధానాన్ని మున్సిపాలిటీల ద్వారా అథారిటీగా చెల్లింపులు జరగాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, రాచకొండ శివ, ఈ హరిబాబు, మున్సిపల్ , ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నకిలీ పోలీస్ హల్ చల్

ప్రజాశ క్తి - తాడేపల్లి

సిమెంట్ ఫ్యాక్టరీలో నకిలీ పోలీస్ ఆదివారం హల్‌చల్ చేశాడు. సుమారు 30 సంవత్సరాలు ఉన్న యువకుడు ఫుల్లుగా మద్యం సేవించి, తాను పోలీస్ డిపార్టుమెంటనీ, తనకు కొంత డబ్బు ఇవ్వాలని స్థానికులను డిమాండ్ చేశారు. కొంత మంది అతను అడిగిన మొత్తం సమర్పించుకున్నారు. అయితే అతని వాలకం, మాట్లాడుతున్న తీరు చూసి పెద్ద ఎత్తున ప్రజలు పోగై నిలదీశారు. పోలీస్ డిపార్టుమెంటు ఇచ్చిన ఐడి కార్డ్ చూపించ మని అడగడంతో తన బండారం బట్టబయలవుతుందని భావించి తాను అసలు పోలీసు కాదని ఒప్పేసుకున్నాడు. స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. కేసు విచారిస్తున్నారు.



నకిలీ పోలీసు

బాల భాస్కర్‌కు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసినందుకు కె. బాల భాస్కర్ కు పిహెచ్ డి డిగ్రీని ప్రధానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఇన్చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ యడ్వర్సరియల్ ఎటాక్స్ యూజింగ్ ఎంబుల్ మోడల్స్ అనే అంశంపై ఆయన పరిశోధన గ్రంథం సమర్పించారు. బాల భాస్కర్‌కు పరిశోధన పర్యవేక్షకులుగా ఆచార్య సత్యప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి విసి ఆచార్య కే .గంగాధర రావు, డిన్ ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ .రవికుమార్ తదితరులు బాలభాస్కర్‌కు అభినందనలు తెలిపారు.

మ్యాట్‌ల్యాబ్‌పై చలపతి కాలేజీలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండ్రోజుల వర్క్‌షాప్ ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా ఐఆర్‌ఎస్‌డిఎల్ హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎ.దిలీప్ కుమార్ మాట్లాడుతూ మ్యాట్ ల్యాబ్ ఆవశ్యకత గురించి వివరించారు. మ్యాట్ ల్యాబ్ అనేది ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ఉన్న సమస్యలకు వర్చువల్ విధానంలో రిజల్ట్ అనాలసిస్ చేసి, మనకు కావాల్సిన టార్గెట్ అవుట్‌పుట్ అందుకోవటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. మ్యాట్‌ల్యాబ్ పవర్‌గ్రిడ్‌పై ఎంత కరెంటు ఉంటుంది, ఆ పవర్ గ్రిడ్‌కు పవర్ జనరేట్ చేయటానికి ఎన్ని జనరేటింగ్ స్టేషన్లలో ఎంత కరెంటు అవసరమో అని పరిష్కరించి తెలుసుకోవటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ విజ్ఞానాన్ని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవటానికి ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మ్యాట్‌ల్యాబ్ కేవలం ఎలక్ట్రికల్ విద్యార్థులకే కాకుండా ఈసిఈ, కంప్యూటర్ ఎలైడ్ బ్రాంచ్‌ల వారికి బాగా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ పి.వి. నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థినులు

సెయింట్ ఆన్స్‌లో ఘనంగా వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య అధ్యక్షత వహించగా, ఫార్మల్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఫాతిమారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఫాతిమారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యాభ్యాస్యం, పూర్తి అయిన తర్వాత తమ విలువలను పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులను ఎప్పుడూ మరిచిపోకూడదన్నారు. అనంతరం విద్యార్థినులు కళాశాలలో వారి అనుభవాలను, గురువులతో అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం మిస్ సెయింట్ ఆన్స్ పోటీలు నిర్వహించి, గురులక్ష్మి, నిఖిత, దివ్యకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో

వర్సిటీలో నేటి నుండి జాతీయ సదస్సు


ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్థిరమైన అభివృద్ధి కోసం అంశాలపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమవుతుందని సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. సుబ్బారావు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. గంగాధరరావు , పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విశిష్ట అతిథిగా హాజరవుతారు అన్నారు. ప్రఖ్యాత సిస్టమ్స్ కెమిస్ట్రీ శాస్త్రవేత్త, టాంజానియా దేశానికి చెందిన డొడోమా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర ఆచార్యులు ఎస్ బి నంబూరి ఈ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అనేక నూతన ఆవిష్కరణలను ఆయన రూపొందించారు. రసాయన శాస్త్ర పరిశోధనలలో రసాయనాల వినియోగాన్ని తగ్గించి, క్వాంటం కెమిస్ట్రీ మెథడాలజీని అభివృద్ధి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన అతి తక్కువ ఖర్చుతో వినియోగించడానికి వీలుగా ఉండే ఆర్గానిక్ సోలార్ మెటీరియల్స్‌ను అభివృద్ధి చేయడానికి కషి చేస్తున్నారు. సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సురేష్ బాబు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు చెందిన డాక్టర్ ఎన్ శంకరయ్య, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ భువనేశ్వర్ కు చెందిన డాక్టర్ డి రాంబాబు, విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి సింహాచలం, ఓఎస్డి ప్రొఫెసర్ ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ రవికుమార్, విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె వీరయ్య పాల్గొంటారని చెప్పారు

భాష, సాహిత్య, సాంస్కృతిక విధానాలే సామాజిక శాస్త్రాలు

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్

ప్రజాశక్తి-గుంటూరు



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు

సమాజాన్ని గాడిలో పెట్టగల శక్తిసామర్థ్యాలు భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాలకే ఉన్నాయన్న విషయాన్ని విస్మరించరాదని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆదివారం రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీరామ దామం ఆవరణలో ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు ప్రకటించిన సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ సాహిత్యాభిమానుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. సభకు మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టీ ఎంవి.రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌరీశంకర్ మాట్లాడుతూ భాష పరిరక్షణకు రెండు తెలుగు రాష్ట్రాలూ సాంస్కృతిక విధానాలను రూపొందించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. అస్తిత్వ ఉద్యమాల సంస్కృతులన్నీ సామాజిక ఐక్యతకే దారి చూపుతాయన్నారు. రాయలసీమ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పెనుగొండను నిజమైన కార్యకర్తగా అభివర్ణించారు. ఎంతోమంది రచయితలను గుంటూరుకు ఆహ్వానించి, అవార్డులు అందజేసి వారి ఎదుగుదలకు బాటలు వేశారన్నారు. పరిశోధనాత్మక దృష్టితో అనేక పుస్తకాలపై విలువైన సమీక్షావ్యాసాలు రాశారని చెప్పారు. అయిదు దశాబ్దాల కషికి గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ సుశీలమ్మ మాట్లాడుతూ సామాజిక అభ్యున్నతే అంతిమ ధ్యేయంగా పెనుగొండ సాహితీ సజన జరిగిందన్నారు. దుఃఖం మాత్రమే కాదు, ధిక్కారం కూడా అవసరమని ఆయన సూత్రీకరించటం అభినందనీయమన్నారు. ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం భాషా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు గొప్ప ప్రోత్సాహాన్నందిస్తోందని, తెలుగు రాష్ట్రాలు కూడా ఆదిశగా కషి చేయాలన్నారు . అనంతరం పెనుగొండ లక్ష్మీనారాయణను మోదుగుల వేణుగోపాలరెడ్డి, వాసుదేవరెడ్డి ఘనంగా సత్కరించారు. అభినందన సత్కారం అందుకున్న పెనుగొండ స్పందిస్తూ మార్క్సిజం ప్రేరణతో సుదీర్ఘకాలంగా అభ్యుదయ రచయితల సంఘం బాధ్యతలను ఇష్టంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. తాను అందుకోబోతున్న అవార్డు 'అరసం'కే దక్కుతుందని తెలియజేశారు

వీధినాటికలకు పెరుగుతున్న ఆదరణ

నాటక రంగానికి పునరుజ్జీవం పోసిన కోటప్పకొండ తిరునాళ్లు : మంచి చిత్రాల అభిమాన సంఘం వ్యవస్థాపకులు ఈదర గోపిచంద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా







గత నెల 26న జరిగిన కోటప్పకొండ తిరునాళ్లలో 5 చోట్ల ప్రదర్శించిన సాంప్రదాయక గ్రామీణ కళా రూపాలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నాయని, తెల్లవారే వరకు యాత్రికులను కనువిందు చేశాయని మంచి చిత్రాల అభిమాన సంఘం వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్, సంఘం ప్రతినిధి కంచర్ల నాగ వీరయ్య ఆదివారం నరసరావుపేటలో తెలిపారు. శాలివాహన ధర్మ సత్రం ముందు కావూరు గ్రామానికి చెందిన 22 మంది కళాకారులచే గొట్టం ఆంజనేయులు దర్శకత్వంలో బ్రహ్మంగారి జీవిత చరిత్ర పూర్తి నాటకం, కాకతీయ కళావేదికపై సినిమా పాటల కచేరితో పాటు, ప్రముఖ నాటక కళాకారులు సింగరకొండయ్య ఆధ్వర్యంలో గయోపాఖ్యానం, శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం తదితర పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శింపబడ్డాయన్నారు. గత 14 ఏళ్లుగా నవభారత దివ్యాంగ కళాకారుల సంక్షేమ సంఘం కర్నాటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఎదుట మంచి సినిమా పాటల కచేరి - మిమిక్రీ- ఏకపాత్రాభినయాలు, శ్రీ విఘ్నేశ్వర మురళి మహిళా బృందం ఆధ్వర్యంలో కోలాటం భట్రాజు సంఘం సత్రంలో బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించ బడ్డాయన్నారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ ఒకప్పుడు ప్రజలలో చైతన్యం నింపేందుకు నాటకాలు సాంప్రదాయ గ్రామీణ కళా రూపాలు దోహదం చేశాయన్నారు. ప్రజలలో చైతన్యం నింపడంతో పాటు ఆలోచింప చేశాయన్నారు. అంతరించి పోతున్న కళలను బతికించు కునేందుకు కళాకారులను ఆదుకోవాలన్నారు. ఆధునిక కాలంలో మళ్లీ వీధి నాటకాలకు ఆదరణ పెరుగుతుందన్నారు. అంతరించి పోతున్న వీధి నాటకాలకు కళాకారులు జీవం పోస్తున్నారన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు ఉంటుండటంతో చాలా మంది వాటిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అభ్యుదయ వాదులు, యువకులు కళాకారులకు విరాళాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కోటప్పకొండ తిరునాళ్లలో ఆయా నాటికలు, నాటకాలు ప్రదర్శించడం తిరునాళ్లకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు.

నాటి తరం రచనలపై నేటి రచయితల పత్ర సమర్పణ

ప్రజాశక్తి - గుంటూరు

తెలంగాణా భాషా సాంస్కృతి శాఖ సౌజన్యంతో అక్షరయాన్, సీతాస్ ఛారిటబుల్‌ట్రస్ట్, అభిజ్ఞ భారత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదులో శని,ఆది రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. రవీంద్రభారతిలో నిర్వహించిన సదస్సులో పలువురు రచయితలు పాల్గొని ఆ తరం రచయిత్రుల గురించి ఈ తరం రచయిత్రులు పాత్ర సమర్పణ చేశారు. ఆదివారం కార్యమ్రంలో గుంటూ రుకు చెందిన రచ యిత దినవహి సత్యవతి దేవీ ఆ తరం రచయిత బోయి విజయ భారతి గురిం చిన పత్ర సమ ర్పణ చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న సత్యవతిదేవి

గుంటూరులో సెంట్రల్ వేర్‌హౌస్ వ్యస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గుంటూరు 69వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం స్థానిక చుట్టుగుంట వద్ద ఉన్న సెంట్రల్ వేర్‌హౌస్ వద్ద నిర్వహించారు. వేర్ హౌస్ మేనేజర్ ఎన్.వెంకట రమణ, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ వి.వెంకట సాహితి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రైతులు, హమాలీలు, ఆర్‌సిఎఫ్, ఇఫ్‌కో, సిసిఐ ప్రతినిధులు, కార్పొరేషన్ రిటైర్డ్ ఉద్యోగులు పి.రాజారావు, విజయ్‌సింగ్, కె.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట సాహితీ